చెట్లకు నిప్పు.. ప్రకృతికి ముప్పు

- ఫిరంగిపురం మండలంలో గుంటూరు – కర్నూలు రాష్ట్ర రహదారి వెంట చెట్లకు నిప్పు పెడుతున్న ఆగంతకులు
- కాలిన చెట్లను కొట్టేసి సొమ్ము చేసుకుంటున్న వైనం
- పర్యావరణానికి గొడ్డలిపెట్టు
- పట్టించుకోని అధికారులు


నిప్పుపెట్టడంతో పడిపోయిన చింతచెట్టు

ఫిరంగిపురం: పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో దోహదం చేస్తాయి. చెట్లు వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకొని ఆక్సిజన్‌ను అందిస్తాయి. దీనిద్వారా మానవ మనగడకు ఎంతో దోహద పడతాయి. అటువంటి చెట్లను కొందరు ఆగంతకులు వాటి తొర్రల్లో నిప్పుపెట్టి అవి కాలి పడిపోయిన తరువాత వాటిని ముక్కలు చేసి విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకుని, ఈతతంగాన్ని అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సుమారు 400 చెట్లు...

గుంటూరు – కర్నూలు రాష్ట్ర రహదారిపై జోసిల్ కంపెనీ వద్దనుంచి పొనుగుపాడు అడ్డరోడ్డు వరకు సుమారు 400 వరకు చెట్లు రోడ్డుకు ఇరువైపులా ఉన్నాయి. వాటిలో చింత, నేరేడు, వేప, మర్రి, కానుగ, పున్నాయి చెట్లు ఉన్నాయి. వాటిలో ఎక్కువ శాతం నలభై ఏళ్లకు మించిన చెట్లు కావడం విశేషం. వేసవి, ఇతర కాలాల్లో ఈ చెట్లు చల్లటి నీడనిస్తూ, వాహనచోదకులకు హాయినిస్తున్నాయి. ఆ దారిన వెళ్లే ప్రయాణికులు కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు ఈ చెట్లు ఆగుతారు. వెనకటికాలంలో బండ్లులో ప్రయాణం చేయడం, రైతులు, కూలీలు పొలం పనులకు వెల్లి తిరిగి ఇంటికి వస్తున్నప్పుడు కొద్దిసేపు చెట్లు కింద కూర్చుని ప్రయాణ అలసటను తీర్చుకునేవారు.


రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు

చెట్లను నరికివేస్తున్న ఆగంతకులు..

కాగా ఈ రహదారిలో ఉన్న ఎన్నో ఏళ్లనాటి చింతచెట్ల తొర్రల్లో కొందరు అగంతకులు రాత్రిళ్లు నిప్పు పెడుతున్నారు. దీంతో అది మండి చెట్టు పక్కకు పడిపోతుంది. కొద్ది రోజుల తరువాత దానిని ముక్కలు చేసి బయట విక్రయిస్తున్నారు. ఇది ఈ ప్రాంతంలో సర్వసాధారణమైంది.

కొత్త మొక్కలేవీ..?

రోడ్డుకు ఇరువైపులా కొన్ని ప్రాంతాల్లో ప్రతి 50 అడుగులకు ఒక మొక్క ఉండాలి. కానీ ఎక్కడా అటువంటి పరిస్థితి లేదు. ఇంతవరకు కొత్త మొక్కలు నాటిన దాఖలాలు లేవు. రెండేళ్ల కిందట హరితవనం పేరిట ఉపాధిహామీ పనుల్లో భాగంగా కొన్ని మొక్కలు నాటినా వాటికి కనీసం నీరు పోయకపోవడం, కంచెలు సరిగా లేకుండటంతో పశువులకు ఆహారంగా మారాయి.

పట్టించుకోని అధికారులు..

ఇప్పటికి ఎన్నో చెట్లకు అగంతకులు నిప్పు పెట్టి చెట్లు కూల్చి సంతలో విక్రయిస్తున్నా పట్టించుకోవాల్సిన రాష్ట్ర రహదారుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే వాదనలు ప్రజలనుంచి వినిపిస్తున్నాయి. కొందరు అగంతకులను ఎవరైనా ప్రశ్నిస్తే మండలకేంద్రంలోని అధికారికి చెప్పామని నరికేందుకు అనుమతి ఇచ్చారని బుకాయిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి చెట్లు నరకనీయకుండా తగిన కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెట్లు కొట్టడం సరికాదు



రోడ్డుకు ఇరు వైపులా ఉన్న చెట్లను అగంతకులు కొడుతుండటం బాధాకరం. దీని ద్వారా పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుంది. పర్యావరణ సమతుల్యతకు, ఎండనుంచి రక్షణకు చెట్లు ఎంతో అవసరం.

– ఎం.మరియప్రసాదు, విశ్రాంత ఉపాధ్యాయుడు, ఫిరంగిపురం

వర్షాలు కురిసేందుకు దోహదం..



చెట్లు సకాలంలో వర్షాలు కురిసేందుకు ఎంతో దోహదం చేస్తాయి. కాని చెట్లను కొడుతుండటంతో వాతావరణంలో మార్పులు వచ్చి, వానలు కురవకుండా పోయే ప్రమాదం ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి చెట్లను పరిరక్షించాలి.

– ఒ.పిచ్చిరెడ్డి, నుదురుపాడు

పొగమంచు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన

తాడేపల్లిరూరల్: తెల్లవారుజామున దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని కేఎల్‌యూ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం వాహనదారులకు సూచించారు. బుధవారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దుగ్గిరాలలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వలంటీర్లు వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. యూనివర్శిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించి వాహనాలను నడపాలని, రోడ్డుభద్రతా సూచనలు పాటించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని వివరించారు. వలంటీర్లను, ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ పి.సురేష్‌లను వీసీ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ హబీబుల్లా ఖాన్, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి తదితరులు అభినందించారు.


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

పారి స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు సృజనాత్మక అవార్డు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి మండల పరిధిలోని నీరుకొండలో వున్న ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారి స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు సృజనాత్మక అవార్డు వచ్చినట్లు యూనివర్శిటీ బృందం బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్ మాట్లాడుతూ యూనివర్శిటీలో మూడేళ్ల కిందట ప్రారంభమైన పారి స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎంబీఏ, బీబీఏ కోర్సుల నిర్వహణలో నూతన ఒరవడిని అవలంభిస్తోందని, పాఠ్యప్రణాళిక, రూపకల్పన, విశేష అనుభవం వున్న అధ్యాపకుల ద్వారా బోధన కొనసాగిస్తోందని, దీనిని గుర్తించి ఔట్‌లుక్ మ్యాగజైన్ గతంలో దక్షిణ భారత దేశంలోనే ఎమర్జింగ్ బిజినెస్ స్కూల్‌గాను, బెస్ట్ ఎమర్జింగ్ స్కూల్‌గాను గుర్తించిందని అన్నారు. ప్రపంచస్థాయి విద్యాబోధనతో పాటు ఉత్తమ ప్రమాణాలను కై వసం చేసుకోవడంలో ప్యారి స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రతిభను కనబర్చిందని, దీనిని గుర్తించిన అకడమిక్ ఇన్‌సైడ్స్ మ్యాగజైన్ 2024 సంవత్సరానికి గాను బెస్ట్ బిజినెస్ స్కూల్‌గా ఎంపిక చేసి అవార్డు ప్రకటించిందని అన్నారు. ఈనెల 18వ తేదీన బెంగళూరులో జరిగిన మ్యాజైగెస్ ఎక్సలెన్సు అవార్డుల కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్శిటీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియా, పారిస్కూల్ డైరెక్టర్ ధర్మతేజలు అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పారి స్కూల్ డీన్ భరద్వాజను అభినందించారు.



అవార్డును అందుకుంటున్న పారి స్కూల్ ప్రోగ్రామ్ డైరెక్టర్ ధర్మతేజ

సమష్టి కృషితోనే పార్టీకి పూర్వ వైభవం

వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు

నెక్కల్లు(తాడికొండ): కార్యకర్తలు, నాయకుల సమష్టి కృషితోనే పార్టీకి పూర్వ వైభవం వస్తుందని అందరూ కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) అన్నారు. బుధవారం తుళ్లూరు మండలం నెక్కల్లు, వెలగపూడి గ్రామాల్లో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీకి ప్రజల్లో ఏ మాత్రం ఆదరణ తగ్గలేదనేందుకు గ్రామాల్లో ప్రజల నుంచి వస్తున్న స్పందనే నిదర్శనమన్నారు. గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు ప్రజలు తమ సమస్యలు వివరిస్తూ కూటమి నాయకుల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమం లేక పడుతున్న ఇబ్బందులు చెబుతున్నారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం చతికిలపడటం ఖాయమన్నారు. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా తాను అందుబాటులో ఉండి వెన్నంటి నడుస్తానని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. పార్టీని మరింతగా పటిష్టం చేసేందుకు త్వరలో మండల, గ్రామ కమిటీల నియామక ప్రక్రియ కొనసాగుతుందని, అందరి ఆమోదంతో ఈ పదవుల ఎంపిక జరుగుతుంది కనుక సిద్ధంగా ఉండాలన్నారు. పోరాటానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీకి ప్రతి కార్యకర్త, నాయకుడు అవసరమేనని చిన్నపాటి విభేదాలుంటే విడనాడి ఐక్యతతో ముందుకు నడిచి రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు పనిచేయాలని సూచించారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బత్తుల కిషోర్, కొప్పుల శేషగిరిరావు, నాయుడు నాగేశ్వరరావు, దానం వినోద్, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు, నెక్కల్లు గ్రామ నాయకులు గుమ్మా శ్రీనివాసరావు, గుమ్మా పూర్ణచంద్రరావు, మేకల రవి, అత్తలూరి పుష్పలత, పూజల నాగేంద్రబాబు, వెలగపూడి గ్రామ నాయకులు మెండెం ఆరోగ్యం, అబ్బూరి పెద్దబ్బాయి. వలపర్ల వసంతరావు, చలివేంద్రం బాబి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నెక్కల్లులో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

కార్మికుల సమస్యలను సత్వరం పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను సీఐటీయూ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వరరావు, వేముల దుర్గావులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నారా లోకేష్, ఏసీసీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రూ.43 కోట్లు 12 శాతం వడ్డీతో సహా కార్మికులకు చెల్లించాలని కోర్టులు తీర్పులిచ్చాయని, పాలక పక్షాలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం అన్యాయమని అన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

ఫిరంగిపురం: ఆధార్ క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అల్లంవారిపాలెంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు బుధవారం ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆధార్ నమోదు చేసే విధానం, తప్పొప్పులు సరిచేయుట, అలాగే 0–6 ఏళ్ల చిన్నారులకు ఆధార్ నమోదు, కొత్త కార్డులు జారీచేయనున్నట్లు ఆయన వివరించారు. నూతన ఆధార్ కోసం 18 వరకు దరఖాస్తులు వచ్చినట్లు ఆయన చెప్పారు.

ఇద్దరు యువకుల ఘర్షణ.. కేసు నమోదు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ నేపథ్యంలో కేసు నమోదైన ఘటన బుధవారం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన ఓ వివాహితతో యువకుడు దురుసుగా ప్రవర్తించడంతో ఆమె భర్తకు, యువకుడికి మధ్య ఘర్షణ జరిగింది. ఈ గొడవలో ఇద్దరు ఒకరిపై ఒకరు దాడిచేసుకోవడంతో ఇరువురికీ గాయాలు అయ్యాయి. దీంతో వివాహిత మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా స్పందించిన రూరల్ ఎస్ఐ వెంకట్ ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి మంగళగిరి తహసీల్దార్ ఎదుట సత్ప్రవర్తన నిమిత్తం రూ.5 లక్షలతో బైండోవర్ చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామ ప్రజలు ఎలాంటి గొడవలకు, దౌర్జన్యాలకు పాల్పడకుండా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు ఘర్షణలకు పాల్పడి తమ విలువైన భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సూచించారు.

స్వామిత్వ సర్వే పరిశీలన



మేడికొండూరు: మండల పరిధిలోని పాలడుగు గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని బుధవారం ఎంపీడీఓ తోట చందన పరిశీలించారు. అధికారులు గ్రామాల్లో చేపట్టిన స్వామిత్వ సర్వేకి ప్రజలు సహకరించాలని కోరారు. ఇప్పటివరకు 450 ఇళ్లలో సర్వే గ్రౌండ్ ధ్రువీకరణ పూర్తయిందని వెల్లడించారు. మినీ గోకులం పశువుల శాలల సందర్శించి పురోగతిని పరిశీలించారు. ఈఓపీఆర్డీ పూర్ణశంకరరావు, పంచాయతీ కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.

పొనుగుపాడులో ‘పొలం పిలుస్తోంది

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఓ వాసంతి పాల్గొని మాట్లాడుతూ రైతు మిత్రగ్రూపుల ద్వారా ఆరునెలలు పొదుపు చేసుకున్నట్లయితే వారికి పెట్టుబడి సాయంగా రూ.లక్ష వరకు రుణాన్ని బ్యాంకులు మంజూరుచేస్తాయని చెప్పారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు తాము వ్యక్తిగతంగా, మరియు గ్రూపులుగా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినట్లయితే బ్యాంకులు వారికి సహకరిస్తాయని చెప్పారు. అనంతరం ఈజీపీ, పీఎం, విశ్వకర్మ, ముద్ర వంటి రుణాలు గురించి వివరించారు. స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వాసంతి

చైతన్య తపోవన్‌లో మానసిక, ఆధ్యాత్మిక శిక్షణ

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని నుకలపేటలో ఉన్న చైతన్య తపోవన్ శివకేశవ పీఠంలో ఫిబ్రవరి 23 నుంచి 26వ తేదీ వరకు మానసిక, ఆధ్యాత్మిక, వికాశ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మాతా శివానంద సరస్వతి తెలిపారు. బుధవారం చైతన్యతపోవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివానంద సరస్వతి మాట్లాడుతూ చతురాహ్నిక దీక్ష శ్రీ శివ కేశవ అష్టమ వార్షికోత్సవంలో భాగంగా మానసిక, ఆధ్యాత్మి,వికాస శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ నాలుగు రోజులు బ్రహ్మముహూర్తంలో ఉదయం 5 గంటల నుంచి 6 వరకు ధ్యానం, 7–9 గంటల వరకు అభిషేకార్చనాది ధార్మిక కార్యక్రమాలు, 10–12 గంటల వరకు జీవితంలో ఎదురయ్యే సమస్యలు – సాధ్యాలపై చర్చ, మధ్యాహ్నం 2–4 గంటల వరకు ప్రధాన దేవతా దర్శనాలు, సాయంత్రం 5–7 గంటల వరకు ఆధ్యాత్మి ప్రవచనాలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నామని శివానంద సరస్వతి తెలిపారు.


మాట్లాడుతున్న మాతా శివానంద సరస్వతి

కల్యాణ మహోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని పాత మంగళగిరి శ్రీ పద్మశాలీయ కల్యాణ మండపంలో బుధవారం శ్రీ భావన ఋషి కల్యాణ మహోత్సవం పోస్టర్లను శ్రీ పద్మశాలి బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ తేదీన పాత మంగళగిరి కళ్యాణ మండపంలో వేంచేసి యున్న శ్రీ భద్రావతి సమేత భావన ఋషి స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం స్వామివార్ల పెళ్లికుమారుల ఉత్సవం, రాత్రి కల్యాణ మహోత్సవం జరుగుతుందని, 3వ తేదీన స్వామివార్ల గ్రామోత్సవం, అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. నగర, పరిసర ప్రాంతాల్లోని భక్తులు కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పోస్టర్లను, ఆహ్వాన పత్రికలను, క్యాలెండర్లను ఆవిష్కరించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఊట్ల సాంబశివరావు, మునగాల వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలి బహూత్తమ సేవా సంఘం సభ్యులు

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా బుధవారం పరిశీలించారు. నగర పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అధికారులతో కలసి విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు, సలహాలు అందజేశారు. మురుగు కాలువలను పరిశీలించి కాలువలలో ఎప్పటికప్పుడు చెత్తా చెదారం తొలగించాలని సూచించారు. నగరపాలక సంస్థ పరిధిలో వున్న వివిధరకాల షాపుల యజమానులు చెత్తను నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని, రోడ్లపై, డ్రైన్లలో వేయరాదని అన్నారు. రోడ్లను, వీధులను, డ్రైన్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, తాగునీటి పైపులైన్‌లు లీకేజీలు ఉండకుండా ఎమినిటీ సెక్రటరీలు తమ తమ వార్డుల్లో పర్యటించి సమస్యలు ఉంటే పరిష్కరించాలని పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన....

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌ను బుధవారం కమిషనర్ అలీమ్‌బాషా అధికారులతో కలసి పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లో పరిశుభ్రతపై అక్కడి సిబ్బందిని ఆరా తీశారు. తాగునీరు, భోజన సదుపాయం సక్రమంగా అందజేస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నగరపాలక సంస్థ అధికారులు డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేమవరంలో పశు ఆరోగ్య శిబిరం



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్యశిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మున్నంగి శివకుమారి ప్రారంభించి మాట్లాడుతూ పశువైద్యశిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని చెప్పారు. 200 పశువులు, దూడలకు డీవార్మింగ్ చేశారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి పీర్ అహ్మద్ డీవార్మింగ్ చేయడం వల్ల కలిగే ఫలితాలు తెలియజేశారు. పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

‘చలపతి’ చైర్మన్ ఆంజనేయులు జన్మదిన వేడుకలు

రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం



తాడికొండ: చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నాగ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో రెయిన్‌బో బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించడంతో పాటు విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు, కళాశాల కార్యదర్శి వై.సుజిత్ కుమార్, కోశాధికారి వై.అనంత కుమారి, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరు జెడ్పీ హైస్కూల్‌లో వివేకానంద జయంతి వేడుకల ముగింపు కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గుంటూరు యునెస్కో క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు విద్యార్థులకు అధిక సంఖ్యలో హాజరయ్యారు. యునెస్కో సభ్యులకు పాఠశాల అధ్యాపకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిరందాసు నాగార్జున పాల్గొని మాట్లాడారు. దక్షిణ భారత దేశ యునెస్కో క్లబ్బుల ప్రాంతీయ కో–ఆర్డినేటర్ రామనాథం పరమేశ్వరరావు మాట్లాడుతూ యువతే దేశాభివృద్ధికి పునాదులని అన్నారు. అనంతరం వివేకానందుని జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం శంకర్, మంగళగిరి యూనియన్ బ్యాంక్ మేనేజర్ లోవ, గుంటూరు యునెస్కో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మద్యం సేవించి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నియమాలు పాటించకున్నా కఠిన చర్యలు తప్పవని మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్ హెచ్చరించారు. నగరపరిధిలో బుధవారం మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ మద్యంసేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని, మృతుడిపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఆయన సూచించారు.

కౌలు రైతు కార్డుదారులకు పంట రుణాలు



తాడికొండ: కౌలు రైతు కార్డుదారులకు పంట రుణాలు అందజేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పెదపరిమి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ వి.విజయ, బ్యాంక్ ఆఫ్ బరోడా క్రెడిట్ మేనేజర్ ఎ శ్రీకాంత్‌లు పేర్కొన్నారు. బుధవారం తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కౌలు రైతులకు రుణాల మంజూరుపై నిర్వహించిన అవగాహన సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. తమ బ్యాంకు పరిధిలో కౌలు రైతు కార్డు ఉన్న రైతులకు రుణాలు అందజేస్తామని, అయితే భూమి ఉన్న రైతు రుణం తీసుకొని ఉండకూడదని, అంగీకార పత్రం కూడా అందజేయాలన్నారు. ఇప్పటివరకు కౌలు రైతు కార్డు ఉండి పంట రుణాలు తీసుకోని రైతులు ఎవరైనా ఉంటే తమ బ్యాంకులో సంప్రదించాలని వారు సూచించారు. మండల వ్యవసాయాధికారిణి కె.శ్రీ రంజని మాట్లాడారు.

మహాసభలను జయప్రదం చేయండి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 24వ తేదీన గుంటూరు జిల్లా ఆటో కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటియూసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఏఐటీయూసీ కార్యాయలంలో బుధవారం మంగళగిరి ఎయిమ్స్ ఆటో డ్రైవర్స్ యూనియన్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన పథకాల గురించి చర్చించారు. నాయకులు చిన్ని సత్యనారాయణ, అన్నవరపు ప్రభాకర్, రాచకొండ శివ, గండికోట దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ప్రతిభా పురస్కార గ్రహీత రమేష్‌కు సన్మానం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన గంగాశ్రీ బిరుదాంకితులు డాక్టర్ రంగిశెట్టి రమేష్‌కు శ్రీశ్రీ కళావేదిక వారిచే తెలుగుకీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం ఇటీవల లభించింది. ఈ సందర్భంగా బుధవారం చిలువూరు గ్రామస్తులు రమేష్‌ను సత్కరించారు. గ్రామానికి చెందిన రమేష్ సాహిత్యంపై చేసిన విశేష కృషికి ఫలితంగా ఈ అవార్డు లభించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP 2/2022 in OS. 71/2017

Between:-
Kasukurthi Govinda Rao -DHr
And
Kondapalli Deena Kumari and Others -JDr's

పై నెంబరు EPలో ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆ.డి.అర్స్ యొక్క స్థిరాస్తిని పైకోర్టు వారిచే ది.12-2-2025వ తేది ఉదయం గం. 10.30 ని ల లగాయతు వేలం వేయబడును. కావలసినవారు వేలం పాటలో పాల్గొని పాడుకొనవచ్చును.

E.P. SCHEDULE

Guntur District, Duggirala Sub-District, Duggirala Gram Panchayat area, Duggirala Village D.No.345/A 14, Door No.14-22, Block No.14 an extent of Ac.3-45 cents, out of it an extent of 67/5 Sq.Yards of house site and in it R.C.C building is situated in an extent of 325 Sq.feet including other amenities to the property bounded by:
East : Property of Kondapalli Vara Prasad- 24.3 ft. **South** : Site of Nuthakki Govaraju - 25 ft. **West** : Property of Kondapalli Elia - 24.6 ft **North** : Panchayat Road - 24.9 ft. (Eastern & Western side boundaries amended as per order dt.27-12-2024 in E.A.No.361/2024) Within the above said 67.5 sq.yards of site and R.C.C building therein with other aminities.

DHr Value Rs. : 8,00,000/-
Amina Value Rs. : 9,00,000/-
Sale Date : 12-02-2025
Forther Hearing : 19-02-2025
EC దాఖలా అన్యాక్రాంతములు లేవు (శ్రీకోర్టు వారి ఉత్తర్వులలో)

Sri **P. Nagendram**
Advocate for DHR
Tenali. Cell: 90305 61113